క్లుప్తంగా

సమగ్ర భూ సర్వే ప్రభుత్వ లక్ష్యం



కేబీపాలెం(కాకుమాను): గ్రామాల్లో సమగ్ర భూ సర్వే చేయడం ప్రభుత్వ లక్ష్యమని వ్యవసాయ సలహా మండలి జిల్లా చైర్మన్ నల్లమోతు శివరామకృష్ణ పేర్కొన్నారు. మండలంలోని కేబీ పాలెంలో ఆదివారం డ్రోన్‌తో రీ-సర్వే చేపట్టారు. శివరామకృష్ణ మాట్లాడుతూ రీ-సర్వే ద్వారా రైతులకు తమ భూముల వివరాలు స్పష్టంగా తెలుస్తాయని చెప్పారు. జెడ్పీటీసీ ముజావర్ షేక్ గుల్జార్ బేగం మాట్లాడుతూ సంపూర్ణ భూ హక్కు కల్పించాలనే లక్ష్యంతో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రీ-సర్వే చేపట్టినట్లు తెలిపారు. ప్రతి రైతు రీ-సర్వేలో పాల్గొని సహకరించాలని కోరారు. సర్పంచ్‌ల సంఘం మండలాధ్యక్షుడు వింతా రాఘవరెడ్డి, తహసీల్దారు జె.ప్రసాదరావు, ఎంపీడీఓ దేవరకొండ శరత్ బాబు, ఈఓపీఆర్డీ నాగానంద్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు గాయాలు

మంచాల(చేబ్రోలు): ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించే క్రమంలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి భార్యాభర్తలకు గాయాలైన ఘటన మంచాల గ్రామ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. బాపట్లకు చెందిన శివ నాగేశ్వరి ఆమె భర్త బైక్‌పై గుంటూరు నుంచి బాపట్లకు వెళ్తున్నారు. మంచాల గ్రామ శివారులోని వంతెన వద్ద ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించే ప్రయత్నంలో రోడ్డు మీద ఉన్న మెటల్‌తో పూడ్చిన గుంతలో పడి ప్రమాదానికి గురయ్యారు. ఈ ఘటనలో శివ నాగేశ్వరికి కాళ్లు, చేతులు, ముఖానికి గాయాలయ్యాయి. ఆమె భర్త స్వల్ప గాయపడ్డాడు. ఇరువురిని 108 వాహనంలో గుంటూరు వైద్యశాలకు తరలించారు. మంచాల గ్రామ సమీపంలో జీబీసీ రహదారిపై ఏర్పడిన గుంత వాహనదారులకు ప్రాణ సంకటంగా మారింది. ఈ గుంతకు దీర్ఘకాలంగా మరమ్మతులు చేపట్టకపోవడంతో.. నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. పెద్ద గుంత పడిన ప్రాంతంలో మెటల్‌తో నింపి చేతులు దులుపుకున్నారు. వాహనదారులు మెటల్‌పై అదుపుతప్పి ప్రమాదానికి గురవుతున్నారు.

అన్నమయ్య పాటల పోటీలు

తెనాలి: పట్టణ బోసురోడ్డులోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానం ప్రాంగణంలోని గీతా మందిరంలో ఆదివారం శ్రీవేంకటేశ్వర అన్నమాచార్య సంకీర్తన సేవాబృందం ఆధ్వర్యంలో అన్నమయ్య పాటల పోటీలు నిర్వహించారు. ఆరేళ్ల నుంచి 60 ఏళ్ల వయస్కులవారు 80 మంది ఈ పోటీల్లో పాల్గొని అన్నమయ్య గీతాలను ఆలపించారు. విజయవాడలోని ఘంటసాల సంగీత కళాశాల విశ్రాంత అధ్యాపకుడు కేవీ బ్రహ్మానందం న్యాయనిర్ణేతగా వ్యవహరించారు. పోటీలో పాల్గొన్నవారిలో అందే తన్మయి, మువ్వా ప్రవస్తి, జాహ్నవి, హరిణి, మానసవీణ, శ్రీజ, అనిరుధ్, మేఘన, హిమబిందు తదితరులున్నారు. సంస్థ కన్వీనర్ కొండపి శ్రీనివాసరావు మాట్లాడుతూ 11 ఏళ్లుగా వివిధ కార్యక్రమాలను చేపడుతున్నట్లు తెలిపారు. అన్నమయ్య జయంతి మే 7న తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో విజేతలకు బహుమతులను ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. సంస్థ బాధ్యులు లక్కరాజు లక్ష్మణరావు, కొండపి వసుంధర, భారతీదేవి, దేవానంద్, లక్కరాజు కనకదుర్గ, జి.యశస్విని, ఎస్.దేవిలలిత, ఎస్.కేశవరావు, జి.శివజ్యోతి పాల్గొన్నారు.



పట్టలపై ఉన్న నీటిని బయటకు తోడుతున్న రైతులు



కల్లాల్లో మిర్చిపై టార్పాలిన్ పట్టలు

వదలని వాన..

ప్రత్తిపాడు: వాతావరణ మార్పులు కర్షకులను, రైతులను కలవరానికి గురిచేస్తున్నాయి. మధ్యాహ్నం వరకు మండే ఎండలకు ఉక్కపోతతో ప్రజలు అల్లాడిపోతుంటే.. అకస్మాత్తుగా కారుమబ్బులు కమ్ముకుంటున్నాయి. వదలకుండా కురుస్తున్న అకాల వర్షాలకు మిర్చి రైతులు కల్లాల వైపు ఉరుకులు పరుగులు పెడుతున్నారు. ఆదివారం సాయంత్రం కూడా వర్షం పడటంతో కల్లాల్లోని మిర్చి పంటను కాపాడుకునేందుకు పడరాని పాట్లు పడ్డారు. టార్పాలిన్ పట్టాలు కప్పుకుని మిరపకాయలు తడవకుండా కాపాడుకున్నారు. ఎప్పుడు వర్షం కురుస్తుందో తెలియక నానా హైరానా పడుతున్నారు. దీనికితోడు వరుసగా మరో రెండు రోజులు వర్షాలుంటాయని వాతావరణ శాఖ చెబుతుండటంతో మిర్చి రైతులు మరింత కంగారు పడాల్సి వస్తోంది.

రైతు సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం

తురకపాలెం సొసైటీ చైర్మన్‌గా దుగ్గెంపూడి భూపాల్‌రెడ్డి ప్రమాణస్వీకారం



చైర్మన్ దుగ్గెంపూడి భూపాల్‌రెడ్డిని అభినందిస్తున్న జెడ్పీటీసీ తుమ్మల, నాయకులు

గుంటూరు రూరల్: రైతుల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని గుంటూరు రూరల్ జెడ్పీటీసీ తుమ్మల సుబ్బారావు పేర్కొన్నారు. ఆదివారం తురకపాలెం గ్రామంలోని సొసైటీ కార్యాలయంలో నూతనంగా నియమితులైన సొసైటీ చైర్మన్ దుగ్గెంపూడి భూపాల్ రెడ్డి ప్రమాణ స్వీకారోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న జెడ్పీటీసీ మాట్లాడుతూ.. చైర్మన్‌గా ఎన్నికైన భూపాల్‌రెడ్డి వ్యవసాయ కుటుంబంలో జన్మించి, నేడు సొసైటీ చైర్మన్‌గా ఎంపికవ్వటం అభినందనీయమన్నారు. రైతుల అభివృద్ధికి కృషిచేయాలని చైర్మన్‌ను కోరారు. చైర్మన్ భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. మాజీ మంత్రి, ఎమ్మెల్యే మేకతోటి సుచరిత, వైఎస్సార్ సీపీ తనపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా.. రైతుల సంక్షేమం కోసం శక్తి వంచనలేకుండా కృషిచేస్తానన్నారు. అనంతరం చైర్మన్ భూపాల్‌రెడ్డి, డైరెక్టర్‌లు గుడిమెట్ల రాజా, ఐలం హనుమంతరావు పదవీ బాధ్యతలు స్వీకరించారు. 27వ డివిజన్ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు దుగ్గెంపూడి యోగేశ్వర రెడ్డి, మండల వైస్ ఎంపీపీ ఇంటూరి పద్మావతి, తురకపాలెం సర్పంచ్ డబ్బూరి సూర్యప్రకాశరావు, మైనింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ దగ్గుల మల్లికార్జునరెడ్డి, సొసైటీ మాజీ ప్రెసిడెంట్లు తంగెళ్ళ నాగేశ్వరరావు, ఏరువ కోటిరెడ్డి, మాధిరెడ్డి శ్రీనివాసరెడ్డి, సోషల్ మీడియా కో కన్వీనర్ బచ్చనబోయిన గోపి, మాజీ సర్పంచ్ నడవా వీరయ్య, చల్లా వెంకట్రామిరెడ్డి, చల్లా పార్థురెడ్డి అభినందనలు తెలిపారు.

కనుల పండువగా కల్యాణోత్సవం



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

కాకుమాను: కాకుమానులోని శ్రీ మద్విరాట్ పోతులూరి వీర బ్రహ్మేంద్రస్వామి పంచమ వార్షిక కల్యాణ మహోత్సవం ఆదివారం కనుల పండువగా జరిగింది. స్వామివారికి సుప్రభాత సేవ, ఉప నిషత్ పారాయణం ఘనంగా నిర్వహించారు. అభిషేకం, అర్చన కార్యక్రమాలు, పూర్ణాహుతి కార్యాక్రమాలు నిర్వహించారు. గోవింద మాంబ, వీర బ్రహ్మేంద్ర స్వామి కల్యాణ మహోత్సవం కొమ్మూరి విశ్వరూపాచార్యులు ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అన్న సంతర్పణ చేశారు.



గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి

ఘనంగా వీర బ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవం

పొన్నూరు(చేబ్రోలు): పొన్నూరు పట్టణంలోని నిడుబ్రోలు రైల్వే స్టేషన్ ఎదురుగా గల పోతులూరి వీర బ్రహ్మేంద్రస్వామి 24వ ఆరాధన మహోత్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి. గోవింద మాంబ సమేత మద్విరాట్ పోతులూరి వీర బ్రహ్మేంద్రస్వామి గురుపూజా మహోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు, విశేష కార్యక్రమాలను భక్త బృందం నిర్వహించింది. భక్తులకు అన్నదానం చేశారు.

ఉచితంగా కాంక్లియర్ ఇంప్లాంట్ ఆపరేషన్లు


పెదకాకాని: పుట్టుకతో మూగ, చెవిటి పిల్లలకు ఉచితంగా కాంక్లియర్ ఇంప్లాంట్ ఆపరేషన్లు చేస్తున్నట్లు డాక్టర్ నెలకుర్తి కృష్ణకాంత్ తెలిపారు. విజయవాడ సూర్యారావుపేట నక్కల రోడ్డులోని విజయవాడ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్‌లో ఐదేళ్ల లోపు పిల్లలకు రూ.10 లక్షల ఖరీదు కల ఆపరేషన్‌లు చేయడం జరుగుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వ ఆడాప్ స్కీమ్ ద్వారా నిర్వహిస్తున్న ఉచిత కాంక్లియర్ ఇంప్లాంట్ ఆపరేషన్లను మూగ, చెవిటి పిల్లల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు 92921 04108, 76759 64266 సంప్రదించాలని తెలిపారు.

ఘనంగా బ్రహ్మేంద్రస్వామి ఆలయ వార్షికోత్సవం



గుంటూరు రూరల్: మండలంలోని 26వ డివిజన్ అంకిరెడ్డిపాలెంలోని శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ వార్షికోత్సవాలు ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం స్వామివారి ఊరేగింపు ఘనంగా చేపట్టారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్త జన బృందం కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. సోమవారం అన్నదానం చేయనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

పోలేరమ్మ తిరునాళ్ల ప్రారంభం



ప్రత్యేక అలంకరణలో పోలేరమ్మ

వంగిపురం (ప్రత్తిపాడు): వంగిపురంలోని పోలేరమ్మతల్లి తిరునాళ్ల మహోత్సవాలు వైభవంగా ఆదివారం ప్రారంభమయ్యాయి. నాలుగు రోజుల పాటు జరగనున్న ఈ ఉత్సవాల్లో తొలిరోజు వైశాఖ మాస శుద్ధదశమి గణపతి పూజ, పుణ్యాహవచనం, ఆలయశుద్ధి, అఖండ స్థాపన, అంకురారోహణ కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. రాత్రి గ్రామస్తుల సమక్షంలో గవిడి కాపలా నేత్ర పర్వంగా జరిగింది. ఉత్సవాల్లో భాగంగా సోమవారం 108 జల బిందెలు, పంచామృతాలతో అభిషేకాలు, పోలేరమ్మకి కుంకుమార్చన, 2న పొంగళ్లు, సాయంత్రం శిడిమానోత్సవం, రాత్రి భజన కార్యక్రమాలు, నిత్య పూజలను అర్చకులు వల్లూరి అగస్త్యేశ్వరశర్మ నిర్వహించనున్నారు. 3న ఆఖరి రోజు గ్రామంలో అన్నదానం చేయనున్నారని ఆలయ కమిటీ సభ్యులు ఇక్కుర్తి వెంకట్రామయ్య తెలిపారు.

సెలవుల్లో పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి



తల్లిదండ్రులకు విద్యార్థులు ప్రోగ్రెస్ రిపోర్టులు అందజేస్తున్న హెచ్‌ఎం

ప్రత్తిపాడు: వేసవి సెలవుల్లో తల్లిదండ్రులు తమ పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని వింజనంపాడు సీఎస్ఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం డి.కల్యాణి జయలూక్ పేర్కొన్నారు. స్థానిక హైస్కూల్లో ఆదివారం విద్యా సంవత్సరం చివరి రోజు సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. విద్యార్థుల ప్రోగ్రెస్ రిపోర్టులతో పాటు గ్రంథాలయ పుస్తకాలను వారికి అందజేశారు. హెచ్‌ఎం కల్యాణి మాట్లాడుతూ తల్లిదండ్రులు విద్యార్థుల ప్రగతి నివేదికల ఆధారంగా వారి విద్యా నైపుణ్యాలను అంచనా వేయాలన్నారు. వేసవి సెలవుల్లో వారి విద్యా నైపుణ్యాలను పెంపొందించేందుకు కృషి చేయాలని కోరారు. ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు గేరా మోహనరావు మాట్లాడుతూ.. సెలవుల్లో విద్యార్థులు పుస్తక పఠనం చేయాలని కోరారు. ఉపాధ్యాయులు సుధీర్, వీరయ్య, నాగమల్లేశ్వర రావు పాల్గొన్నారు.

చినరావూరు పార్కులో విద్యుత్ శోభకు రూ.2 లక్షల సామగ్రి



విద్యుత్ బల్బులు, పరికరాలను అందజేస్తున్న కొత్తమాసు కుమార్

తెనాలి: పట్టణ చినరావూరులోని మున్సిపల్ లేక్‌వ్యూ పార్కుకు స్థానిక నటరాజ్ జ్యూయలర్స్ అధినేత కొత్తమాసు కుమార్, చంపకవల్లి దంపతులు రూ.2 లక్షల విలువైన విద్యుద్దీపాలు, పరికరాలను అందజేశారు. విద్యుత్ బల్బులు పనిచేయక, వాకర్స్ పడుతున్న ఇబ్బందులను స్థానిక వార్డు కౌన్సిలరు గుంటూరు కోటేశ్వరరావు, నటరాజ్ జ్యూయలర్స్ దృష్టికి తీసుకెళ్లటంతో స్పందించిన సంస్థ యాజమాన్యం వితరణకు ముందుకొచ్చింది. పార్కు ఆవరణలో ఆదివారం పట్టణ ప్రముఖులు, వాకర్స్ సమక్షంలో ఆయా సామగ్రిని కొత్తమాసు కుమార్ అందజేశారు. పార్కులో ఫ్లడ్ లైట్లు, విద్యుత్ పరికరాలు, కేబుల్స్ దెబ్బతినటంతో రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో వాకింగ్ చేస్తుండే స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను చెప్పగానే స్పందించి సాయం చేసిన కొత్తమాసు కుమార్‌కు గుంటూరు కోటేశ్వరరావు, వాకర్స్ ధన్యవాదాలు తెలియజేశారు. అవసరమైన సామగ్రిని అందించటంతో పార్కుకు విద్యుత్ శోభ సమకూరుతుందనీ, భవిష్యత్‌లో పార్కు అభివృద్ధికి మరింత సహకారం అందిస్తానని కుమార్ ప్రకటించారు. మామిళ్ల జగదీష్, మేడేపల్లి ప్రభాకర్, మామిడాల సుమన్, సురుపుల వెంకట్రావు, పెరుగు మల్లికార్జునరావు, కొణిజేటి శ్రీనివాసరావు, అడపాల ఏడుకొండలు, సుధాకర్, అల్లంపల్లి ప్రసాద్, చుండూరు అరుణకుమార్, నాంచారమ్మ, మున్నంగి సత్యం తదితరులు పాల్గొన్నారు.

రైల్వే ట్రాక్‌పై యువకుడి ఆత్మహత్య

తాడేపల్లిరూరల్: మంగళగిరి- తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని కొలనుకొండ రైల్వేస్టేషన్ సమీపంలో ఓ యువకుడు ఆదివారం తెల్లవారుజామున ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలు.. వడ్డేశ్వరానికి చెందిన మర్రి సూరిబాబు, మహాలక్ష్మమ్మ దంపతుల రెండో కుమారుడు కిరణ్‌కుమార్(24) ఇంజినీరింగ్ పూర్తిచేశాడు. విజయవాడలో చిన్న ఉద్యోగం చేస్తూ హైదరాబాద్‌లో ఉద్యోగం రావడంతో ఆదివారం సాయంత్రం హైదరాబాద్ ప్రయాణం కావాల్సి ఉంది. శనివారం అర్ధరాత్రి దాటిన తరువాత ఇంటికి రావడంతో తల్లి మందలించింది. మనస్తాపానికి గురై ఇంట్లో నుంచి బయటకు వచ్చేసిన కిరణ్‌కుమార్ చెన్నై విజయవాడ రైల్వే ట్రాక్‌పై తలపెట్టి పడుకోవడంతో రైలు ఢీకొట్టి అక్కడికక్కడే మృతి చెందాడు. కిరణ్‌కుమార్ మొండెం, తల వేరు వేరు అయ్యాయి. రైల్వే సిబ్బంది కిరణ్ జేబులో ఉన్న ఆధార్‌కార్డు ఆధారంగా తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. ఘటనపై తెనాలి రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పినపాడు మహాప్రస్థానంలో మార్చురీ గది నిర్మాణం

రూ.4.50 లక్షల విరాళమిచ్చిన ఎన్నారై వీరమాసునేని శ్రీనివాస్



కార్యదర్శి శివరామకృష్ణప్రసాద్‌కు చెక్కు అందజేస్తున్న వీరమాసునేని శ్రీనివాస్

తెనాలి: పినపాడులోని మహాప్రస్థానంలో మార్చ్యూరీ రూంను నిర్మించనున్నారు. మహాప్రస్థాన సేవాసమితి ఆధ్వర్యంలో మార్చురీ రూమ్ నిర్మాణానికి ప్రవాస భారతీయుడు ఆదివారం రూ.4.50 లక్షల చెక్కును సమితి నిర్వాహకులకు అందజేశారు. ఇటీవల మృతిచెందిన జిల్లా పరిషత్ విశ్రాంత సీఈవో వీడీఆర్ మనోహర్ జ్ఞాపకార్థం ఆయన తనయుడు అమెరికాలోని జిప్సమ్ కార్పొరేషన్ చీఫ్ కంట్రోలర్ ఇంజినీర్ వీరమాసునేని శ్రీనివాస్ అవసరమైన మొత్తాన్ని చెక్కురూపంలో విరాళంగా ఇచ్చారు. సేవాసమితి ప్రధాన కార్యదర్శి జెట్టి శివరామకృష్ణప్రసాద్ మాట్లాడుతూ దాత విరాళంతో మార్చురీ రూమ్‌ను నెలరోజుల్లో నిర్మించి, అందుబాటులోకి తీసుకురానున్నట్టు వెల్లడించారు. బంధువులు ఎవరైనా మరణిస్తే, దూరప్రాంతాల్లోని కుటుంబ సభ్యులు వచ్చేవరకు భద్రపరిచేందుకు గుంటూరు, విజయవాడకు వెళ్లకుండా ఇక నుంచి తెనాలి మహాప్రస్థానంలోనే మార్చురీ రూంలో ఉంచేందుకు వెసులుబాటు కలుగుతుందని వివరించారు. తెనాలిలో తొలిసారిగా అందుబాటులోకి రానున్న మార్చురీ రూంకు వితరణ చేసిన దాతను అభినందించారు. కార్యక్రమంలో సేవాసమితి అధ్యక్షుడు ధాకా సాంబిరెడ్డి, కొత్త సుబ్రహ్మణ్యం, తుమ్మల బాపయ్యచౌదరి, బుజ్జి, శంకరరావు, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి పసుపులేటి వెంకటరమణ హఠాన్మరణం



డాక్టర్ పసుపులేటి వెంకటరమణ (ఫైల్)

తెనాలి: పట్టణానికి చెందిన ప్రముఖ ఆయుర్వేద మానసిక వైద్యనిపుణుడు, లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్, రూరల్ మండలం ఎరుకలపూడి గ్రామ మాజీ సర్పంచ్ డాక్టర్ పసుపులేటి వెంకటరమణ (69) హఠాన్మరణం చెందారు. ఆదివారం మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతంలో గుండెపోటుతో నందులపేటలోని తన నివాసంలో మృతిచెందారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. వైద్య వృత్తిలో కొనసాగుతూనే కళా, సేవారంగాల్లో పనిచేశారు వెంకటరమణ. లయన్స్ క్లబ్‌లో వివిధ పదవులు నిర్వర్తిస్తూ తన సేవలతో జిల్లా గవర్నర్‌గా ఎదిగారు. మిత్రులతో కలిసి శారద సాహిత్య వేదికలో పనిచేస్తూ ప్రసిద్ధ రచయిత శారద (ఎస్.నటరాజన్) సాహిత్యాన్ని వెలువరించారు. సాహితీ ప్రముఖులు బి.తిరుపతిరావు, జుగాష్‌విలితో కలిసి కొంతకాలం 'సంతకాలు' పేరుతో పత్రికను తీసుకొచ్చారు. కొంతకాలంగా చదువరుల వేదిక, పుస్తకమిత్ర పేరుతో సాహిత్యసేవలో ఉన్నారు. టీబీ రోడ్డులోని తన కార్యాలయం ఎదుట గత 17 ఏళ్లుగా వేసవి చలివేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. వెంకటరమణ మృతి వార్త తెలియగానే పట్టణానికి చెందిన పలువురు ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

దూషణపై కేసు నమోదు

గుంటూరు ఈస్ట్: కులంపేరుతో ఓ వ్యక్తి భార్యను దూషించిన ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. ఆర్టీసీ కాలనీ గాంధీనగర్‌కు చెందిన షేక్ ఖాజావలి జనవరిలో పి.అచ్యుత అనే యువతిని ప్రేమించి వివాహం చేసుకున్నాడు. అనంతరం తల్లిదండ్రులు వద్దే కాపురం పెట్టాడు. అయితే ఖాజావలి అతడి కుటుంబ సభ్యులు అచ్యుతను తరచు కులంపేరుతో దూషించి కట్నం తీసుకురావాలని వేధించారు. అచ్యుత తల్లిదండ్రుల వద్దకు వచ్చి ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నటులకు స్ఫూర్తి ఎన్టీఆర్

ప్రముఖ సినీనటి భారతీ విష్ణువర్ధన్



భారతీ విష్ణువర్ధన్‌కు పురస్కారం ప్రదానం చేస్తున్న ఎం.భరత్, తేజస్విని

తెనాలి: అభిమానుల ప్రేమకు సాటి ఏదీ లేదని ప్రముఖ సినీనటి భారతీ విష్ణువర్ధన్ అన్నారు. తనలాంటి ఎందరికో మహానటుడు ఎన్టీ రామారావు స్ఫూర్తి అని చెప్పారు. తెనాలిలో జరుగుతున్న విశ్వవిఖ్యాత నటసార్వభౌమ ఎన్టీఆర్ శతజయంత్యుత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి ఇక్కడి ఎన్వీఆర్ కన్వెన్షన్ సెంటరులో జరిగిన సభకు మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ అధ్యక్షత వహించారు. ఎన్టీఆర్ శతజయంతి చలనచిత్ర పురస్కారాన్ని భారతీ విష్ణువర్ధన్‌కు, ప్రముఖ మేకప్ కళాకారుడు పీతాంబరానికి ప్రదానం చేశారు. పీతాంబరం తరఫున ఆయన తనయుడు, సుప్రసిద్ధ దర్శకుడు పి.వాసు పురస్కారాన్ని స్వీకరించారు. అనంతరం భారతీ విష్ణువర్ధన్ తన కృతజ్ఞతాపూర్వక ప్రసంగంలో, క్రీడలు, సంగీతం, నృత్యం అంటే ఆసక్తి కలిగిన తనను ఆర్టిస్టును చేసిన అమ్మానాన్నలేనని చెప్పారు. ప్రేక్షకుల ఆశీర్వాదంతోనే ఈ స్థాయికి చేరుకోగలిగినట్టు చెప్పారు. సినీ దర్శకుడు పి.వాసు మాట్లాడుతూ తన తండ్రి పీతాంబరంతో ఎన్టీఆర్‌కు గల అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. సినిమా తీసి నష్టపోయిన తన తండ్రితో ఎన్టీఆర్ మళ్లీ సినిమాలు చేసినందునే, తానీస్థాయిలో ఉండగలిగినట్టు చెప్పారు. కొండపి ఎమ్మెల్యే డోల బాలవీరాంజనేయులు మాట్లాడుతూ, సినీరంగంలో మకుటం లేని మహారాజులా ఎన్టీఆర్ వెలిగారన్నారు. ఎమ్మెల్సీ పరుచూరి అశోక్‌బాబు తన ప్రసంగంలో తెలుగు భాష ఉన్నంతవరకు ఎన్టీఆర్ చిరస్థాయిగా ఉంటారని చెప్పారు. ప్రముఖ సినీ రచయిత సాయిమాధవ్ బుర్రా మాట్లాడుతూ, అందం, అభినయంలో పోటీపడే మహానటి భారతి అన్నారు. తొలుత గీతం విద్యాసంస్థల అధినేత ఎం.భరత్, బాలకృష్ణ చిన్నకుమార్తె తేజస్విని చేతుల మీదుగా ఎన్టీఆర్ అవార్డులను ప్రదానం చేశారు. నందమూరి యశ్వంత్, చెన్నపురి తెలుగు అకాడమీ ఎండీ తూమాటి సంజీవరావు, కన్నడ నటుడు అనురుతీన్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఏవీ రమణ, మలినేని ఇంజినీరింగ్ కాలేజి చైర్మన్ మలినేని పెరుమాళ్, పాటిబండ్ల జ్యోతి మాట్లాడారు.

మహిళ అదృశ్యంపై కేసు నమోదు

తోట్లపాలెం(చేబ్రోలు): వివాహిత అదృశ్యంపై చేబ్రోలు పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల మేరకు.. తోట్లపాలెం గ్రామానికి చెందిన వాకా ప్రసన్న రెండు రోజుల క్రితం అర్ధరాత్రి ఇంటి నుంచి వెళ్లిపోయినట్లు భర్త వాకా అంకమ్మరావు ఫిర్యాదు చేశారు. ఇరువురు పిల్లలు ఉన్న ప్రసన్న గ్రామానికి చెందిన మరో వ్యక్తితో ఎక్కువ పరిచయంగా ఉండటంతో భర్త మందలించాడు. అంకమ్మరావు ఫిర్యాదు మేరకు.. ఎస్ఐ జి.వెంకటాద్రి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

పుట్టగొడుగుల పెంపకంతో ఆర్థిక వెసులుబాటు

గుంటూరు ఎడ్యుకేషన్: పుట్టగొడుగుల పెంపకం ద్వారా యువ పారిశ్రామికవేత్తలుగా రాణించవచ్చని తనుశ్రీ మష్రూమ్స్ ఇండస్ట్రీస్ వ్యవస్థాపకుడు టి.జయచంద్ పేర్కొన్నారు. ఆదివారం సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాలలో మైక్రో బయాలజీ, ఫుడ్ టెక్నాలజీ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో మష్రూమ్స్ ఫలసాయ పెంపకంపై విద్యార్థినులకు అవగాహనతో పాటు ఒకరోజు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా జయచంద్ మాట్లాడుతూ వేడి వాతావరణానికి తట్టుకుంటూ రూ.500 పెట్టుబడితో ఒక కేజీ విత్తనాలను కొనుగోలు చేసి ఎనిమిది కేజీల పుట్టగొడుగుల ఫలసాయం ద్వారా రూ.రెండు వేల ఆదాయం పొందవచ్చని చెప్పారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వీఆర్ జ్యోత్స్నకుమారి, మైక్రో బయాలజీ, ఫుడ్ టెక్నాలజీ విభాగాధిపతులు పాల్గొన్నారు.